క్లుప్తంగా

సర్వే క్రమపద్ధతిలో చేయాలి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భారతి

తాళ్లూరు: పోషకాహార లోప నివారణ సర్వే క్రమపద్ధతిలో చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి అన్నారు. తూర్పుగంగవరంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం తగిన మోతాదులో తీసుకుని ఆరోగ్యంగా ఉండేలా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. 0 నుంచి ఆరేళ్ల కంటె ఎక్కువ వయసున్న పిల్లలు ఎత్తు మరియు బరువులు తీసి పోషకాహార లోపం ఉన్న వారిని పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని సూచించారు. బాలామృతం పోషక విలువలు కోల్పోకుండా ఉపయోగించటంపై తల్లులకు అవగాహన కల్పించారు. బేబీ ఫుడ్ వంటకాలు ప్రదర్శించారు. సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

తాళ్లూరు: మండలంలో శనివారం నుంచి పశువులు, జీవాలకు గాలికుంటు టీకాలు వేస్తారని పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీల్లో ఏప్రిల్ 24 వరకు నెల రోజుల పాటు గాలికుంటు టీకాలు వేస్తారని చెప్పారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నిప్పంటుకొని చొప్ప దగ్ధం

గిద్దలూరు రూరల్: మండలంలోని కొండపేట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం మొక్కజొన్న చొప్పకు నిప్పంటించడంతో సుమారు రూ.15 వేల నష్టం వాటిల్లింది. ఎవరో ఉద్దేశ పూర్వకంగానే తనకు కష్టం కలిగించేందుకు నిప్పంటించారని రైతు పిక్కిలి జయరాముడు వాపోయాడు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుల్లలచెరువులో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

పొదిలి రూరల్: మండలంలో శనివారం నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ తెలిపారు. శనివారం పొదిలి, ఏలూరు, 27న పొదిలి, టి సల్లూరు, 28న పొదిలి, ఉప్పలపాడు, 29న పొదిలి, గోగినేనివారిపాలెం, ఏప్రిల్ 1న పొదిలితలమళ్ల, 3న అన్నవరం, 4న కాటూరివారిపాలెం, చింతగుంపల్లి, 5న కాటూరివారిపాలెం, ఆముదాలపల్లి, 6న కేవీపాలెం, నిమ్మవరం, 8న కేవీపాలెం, రాములవీడు, 10, 11న కాటూరివారిపాలెం, 12న మల్లవరం, 13 బుచ్చన్నపాలెం, కంభాలపాడు, 15న బచ్చునపాలెం, నందిపాలెం, 17న బుచ్చన్నపాలెం, ఓబులక్కపల్లి, 18న కొండాయపాలెం, 19న సలకనూతల, కొత్తపాలెం, మూగచింతల, 20న కొత్తపాలెం, కుంచేపల్లి, దాసర్లపల్లి, 21న రాజుపాలెం, ఈగలపాడు, పాములపాడు, 22న రాజుపాలెం, మాదాలవారిపాలెం, సూదనగుంట, 23న తుమ్మగుంట, రాజుపాలెం, రామాపురం, గురుగుపాడు, 24వ తేదీ అక్కచెరువు, గొల్లపల్లి గ్రామాల్లో టీకాలు వేస్తున్నట్లు వివరించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



కలనూతల జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు

పెద్దారవీడు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించాలని హెచ్ఎంలు కె.సుధాకర్, డి.కాశీవిశ్వనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని కలనూతల, మద్దలకట్ట జెడ్పీహెచ్ఎస్‌లలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంలు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం విద్యనభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని, విద్యార్థులు విద్య ప్రాధాన్యతను గుర్తించి చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మూల వెంకటేశ్వరరెడ్డి, వార్డు మెంబర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ అనుమానితులు పరీక్ష చేయించుకోవాలి



ర్యాలీకి హాజరైన పీహెచ్‌సీ వైద్యాధికారి



దర్శిలో..



మార్కాపురం: ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రాహుల్, వైద్య సిబ్బంది



పౌష్టికాహారం అందిస్తున్న వైద్యాధికారి రత్నం

బేస్తవారిపేట: క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి మందగించడం, మూడు నెలలుగా బరువు తగ్గినా కళ్లె పరీక్ష చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్విరాజ్ సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జంక్షన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన మంత్రి ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ బాధితులకు ప్రతి మాసంలో రూ.700 విలువైన నిత్యావసరాలు ఇవ్వడం, వ్యాధిగ్రస్తుల సంక్షేమం కోసం ప్రతి మాసం రూ.500 బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పీహెచ్‌సీ అధికారులు హబీబ్‌ఖాన్, రవీంద్రబాబు, క్షయవ్యాధి యూనిట్ పర్యవేక్షకుడు బాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : ప్రపంచ క్షయదినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే తుంపర్లతో ట్యూబర్ కులై బ్యాక్టీరియా వ్యాపిస్తుందని, ఒక్కసారి ఈ బ్యాక్టీరియా ఒంట్లో చేరితే జీవిత కాలం మన లోపలే ఉంటుందన్నారు. వ్యాధి నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని, ప్రస్తుతం టీబీ నుంచి కోలుకునే వారి సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమయ, సీహెచ్ఓ ముంతాజ్, డాక్టర్ మధు, భార్గవరెడ్డి, రవీంద్ర, రంగయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

దర్శి: చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ స్పందన మాట్లాడుతూ రెండు వారాలకు మించి పొడి దగ్గు, నీరసం, ఆయాసం వంటి లక్షణాలు ఉంటే అది క్షయవ్యాధై ఉండే అవకాశం ఉంటుందన్నారు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సీహెచ్ఓ దయానిధి, స్టాఫ్‌నర్స్ ఉషారాణి, ల్యాబ్‌టెక్నీషియన్ వసంత్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, కోరికమ్మ పాల్గొన్నారు.

మార్కాపురం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీవైఎంహెచ్ఓ డాక్టర్ కె.రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మార్కాపురం టీబీ యూనిట్ ఇన్చార్జి డాక్టర్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజశేఖర్, దీపికా, మంజుషా, హెచ్ఈఓలు శ్రీకాంత్, నాగేంద్రరెడ్డి, టిబి యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలో ప్రపంచక్షయ వ్యాధి నివారణ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి బొద్దికూరపాడు పంచాయతీలోని చింతలపాలెంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి బంకా రత్నం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు మౌనిక, సీహెచ్ఓ మరియమ్మ, హెచ్‌వీ సుశీల, హెచ్ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధికి క్రమం తప్పకుండా మందులు వాడి అదుపులో ఉంచుకోవాలని కోరారు. సీహెచ్ఓ ప్రమీల్, హెచ్ఈఓ కొప్పోలు శ్రీనివాసరావు, హెచ్ఎస్ రవి, ఫార్మసిస్ట్ రమేష్ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: నియోజకవర్గంలోని ఎన్ఎస్పీ కెనాల్ ఆయకట్టులో ఉన్న చివరి భూములకు కూడా సాగు నీరందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదేశించారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం ఎన్ఎస్పీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేణుగోపాల్ మాట్లాడుతూ ముండ్లమూరు మండలం పోలవరం, ఉమామహేశ్వరపురం, మారెళ్ల, పూరిమెట్ల, శంకరాపురం గ్రామాల పరిధిలోని రైతులకు సాగు, తాగు నీరు అందించాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నియోజవర్గంలోని అన్నీ తాగునీటి చెరువులు నింపాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. కురిచేడు పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీ వాసుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ లక్ష్మీరెడ్డి, డీఈలు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ జాతీయ సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన అభిరామ్‌ను ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అభినందించారు.

భూముల రీసర్వే పారదర్శకంగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు

ముండ్లమూరు: గ్రామాల్లో భూముల రీసర్వే పారదర్శకంగా జరగాలని ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే మొదటి దశలో శంకరాపురం పూర్తి చేశామని చెప్పారు. రెండో విడతలో తూర్పుకంభంపాడు, కెల్లంపల్లి, పెదరావిపాడు, పోలవరం గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో ఫొటోలు తీయడం పూర్తి అయినందున సంబంధిత భూముల వివరాలు కార్యాలయానికి వచ్చాయన్నారు. సంబంధిత రైతులు సర్వే సమయంలో అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో సర్వే కోసం ప్రత్యేకంగా టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ ఉషారాణి, సర్వే డీటీ రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని ఒంగోలు ఆర్‌డీఓ వి. విశ్వేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం భూముల సర్వేపై వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత గ్రామాల్లో రైతులకు సమాచారం తెలిపి సర్వే నంబర్లు సేకరించి రికార్డులు పరిశీలించి సర్వే త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్ రావుకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ఇస్మాయేల్ రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎన్ఎస్ నగర్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ద్వాదశ, జ్యోతిర్లింగ దివ్యదర్శన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 18 అడుగుల శివలింగాన్ని ఆవిష్కరించారు. బ్రహ్మకుమారి సరస్వతి మాట్లాడుతూ .. ఈనెల 28వ తేదీ వరకు భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు మాధవి, రమ, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పి.రవిచంద్ర, ఎం.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

యర్రగొండపాలెం: చిరు ధాన్యాలను ఆహారంలో ఉపయోగించుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీధర్‌నాయుడు అన్నారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవం సందర్భంగా ఆ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు పాలపర్తి ఝాన్సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, వంటకాల ప్రదర్శనను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొర్రలు, రాగులు, జొన్నలు, సజ్జలు, వరిగలు, సామెలు లాంటి చిరుధాన్యాలు మార్కెట్‌లో విరివిగా దొరుకుతున్నాయని, వీటితో రకరకాల పిండి వంటలు, సంగటి, అన్నం లాంటివి తయారు చేసుకుని ప్రజలు ఉపయోగించుకుంటున్నారని ఆయన అన్నారు. ప్రదర్శనను కళాశాల విద్యార్థులు సందర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసచార్యులు, అధ్యాపకులు డి.తిరుపతయ్య, పి.ప్రదీప్, పి.రామకోటయ్య, కేవీఎస్ శ్రీనివాస్, ఆర్.నాయక్, వి.వెంకటేశ్వరరెడ్డి, ఎ.వలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

త్రిపురాంతకం: పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంఈవో కె.తులసిమల్లికార్జున నాయక్ సూచించారు. కంకణాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సభ, వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, అందరూ చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని అన్నారు. హెచ్ఎం ఉడుముల శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి



కొనకనమిట్లలో టెన్త్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు దాసరి గురుస్వామి, కొనకనమిట్ల, గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు రామాంజనేయులు, వీరాస్వామి, ఫారెస్ట్ బీట్ అధికారి నాగశ్రీ సూచించారు. శుక్రవారం ఆయా పాఠశాలల్లో వార్షికోత్సవంతోపాటు 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవికి పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ పి.సుభ్‌దేవ్, ఉప సర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ చైర్మన్ యు.కాశిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పొదిలి తిరుపతయ్య, పొదిలి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ యు.పెద వెంకటయ్య, పీఎంసీ చైర్మన్ కడెం ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని హెచ్ఎం మాధవి ఆకాంక్షించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. ఉపాధ్యాయులు రసూల్, నాయుడు, ఆనంద్, చంద్రశేఖర్‌రెడ్డి, నేతాజీ, భాస్కర్, భాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

టీబీ అంతం.. మనందరి పంతం

పొదిలి: సమాజం నుంచి టీబీ వ్యాధిని అంతమొందించడమే మనందరి పంతం కావాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీ, ఉప్పలపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్ద బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. టీబీ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుష్మ, జి.ఆనంద్‌బాబు, ఎస్‌కెఎం.రఫీ, కె.సౌజన్య, సీహెచ్.అఖిల్‌రెడ్డి, హరీష్, శివప్రసాద్‌రెడ్డి, ఎస్‌కె.బసంతి, సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఎం విజయ, రాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ నీరు



జల్‌జీవన్ మిషన్ పథకం సర్టిఫికెట్ అందిస్తున్న ఏఈ

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్లగట్టు పంచాయతీ బుడంకాయలపాడు, బచ్చలకూరపాడు, వింజవర్తిపాడు గ్రామాల్లో ప్రజలతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కుళాయి కనెక్షన్ పనులను జేజేఎం, ఐఎస్ఏ నారాయణ సేవా సంస్థలు నూరు శాతం పూర్తి చేయడం అభినందనీయమని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌లు మెట్టు రమణమ్మ, సుఖదేవ్, వెంకటనారాయణకు సర్టిఫికెట్లు అందజేశారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తున్న స్పెషలాఫీసర్ సునీత

కురిచేడు: అన్ని పోషక విలువలు గల సమతుల ఆహారం తీసుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని మండల స్పెషలాఫీసర్ సునీత తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బోధనంపాడులో శుక్రవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే ఆహారాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. పసిపిల్లల్లో పోషక లోపాలకు సరైన ఆహారం లేకపోవడమేనని తహసీల్దార్ నాగూల్‌మీరా తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగే పోషణ్ పక్వాడా కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి తెలిపారు. హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఏపీఎం సైమన్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

పుల్లలచెరువు: విద్యార్థుల సామర్థ్యాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కవలకుంట్ల పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులు, ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్స్‌ను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులపై దృష్టి పెట్టి వారి సామర్థ్యాలు పెంచే విధంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. విద్యార్థులతో ఇంగ్లిషు చదివించి కఠినమైన పదాలను డిక్షనరీలో ఎలా చూడాలో ఎంఈవో వివరించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంను చూసి వారిని అభినందించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం

కొనకనమిట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం పడింది. గొట్లగట్టు పరిసర గ్రామాల్లో అరపదును వర్షం కురిసినట్లు రైతులు తెలిపారు. గొట్లగట్టు పంచాయతీ కార్యాలయం వద్ద, రహదారిపై వర్షం నీరు ప్రవహించింది.

నేడు గుంటిగంగలో ప్రత్యేక గదులు ప్రారంభం

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని ఆలయం వద్ద దాతల సహకారంతో నిర్మించిన ప్రత్యేక వసతి గదుల కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ శనివారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిశెట్టి రవీంద్ర, మద్దిశెట్టి శ్రీధర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జెడ్పీ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జిల్లా పరిషత్ విద్యార్థులు 1, 9, 21, 24, 36, 63 ర్యాంకులు సాధించినట్లు హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. టీవీవీ నాగ రాకేష్, సాయి చరణ్, తరుణ్, పవన్‌కుమార్, అబ్దుల్ ఖయాం, హర్షసాయి, కార్తీక్, రాఘవగౌడ్, నాగలోకేష్, అర్షీఫ్, మహమ్మద్ అఫ్తాబ్, వరప్రసాద్ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు.

జాతీయ ఉపకార వేతన పరీక్షకు ఐదుగురు ఎంపిక

తాళ్లూరు: మండలంలోని లక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఐదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. వీరికి నాలుగేళ్ల పాటు రూ.12 వేలు చొప్పున స్కాలర్స్ షిప్స్ అందిస్తారు. పాఠశాలకు చెందిన దినేష్‌రెడ్డి, శివకృష్ణ, నాగూర్‌వలి, కృష్ణవేణి, సాయి పల్లవిలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బారావు తెలిపారు. గతంలో 20-21 విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులు, 21-22 విద్యా సంవత్సరంలో మరో ఇద్దరు జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) స్కాలర్స్ షిప్స్‌కు ఎంపికయ్యారు. ఈ సంవత్సరం కూడా మరో ఐదుగురు ఎంపిక కావడంతో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పుల్లలచెరువు: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండలంలోని కేంద్రాలను ఎంఈవో శామ్యూల్‌జాన్ శుక్రవారం తనిఖీ చేశారు. డీఈవో ఆదేశాల మేరకు పుల్లలచెరువు జెడ్పీ, పీవీ పల్లి జెడ్పీ, కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బంది కలగరాదన్నారు. ముఖ్యంగా బెంచీల ఏర్పాటు, తాగడానికి మంచినీరు, గదుల్లో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎంలు వరప్రసాద్, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

రుణమాఫీని వినియోగించుకోవాలి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

దొనకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని చేసిన 3వ విడత వైఎస్సార్ ఆసరా రుణమాఫీని సద్వినియోగం చేసుకోవాలని వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు గడప గడపకు చేరవేయడంలో వీఓఏలు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. 3వ విడత వైఎస్సార్ ఆసరా గురించి వివరించారు. మండలానికి 621 గ్రూపులకు రూ.4.04 కోట్ల రుణమాఫీ మంజూరు చేశారన్నారు. మహిళలు ఆనందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

రైతుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన

కంభం: అడవి పందుల నుంచి రైతులు పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. రైతులు తాము పండించిన పంటను కాపాడుకునే చర్యల నేపథ్యంలో అడవి పందులు ప్రమాదానికి గురై మరణిస్తే అటవీశాఖ అధికారులు తమ చట్టాలను రైతులపై ప్రయోగించి జరిమానాలు, కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అడవి పందుల బెడద ఉన్న పొలాల రైతులపై కేసులు లేకుండా చూడాలని కోరారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములు, వాగు భూములు, కుంట భూములు గుర్తించి సచివాలయ సర్వేయర్ల ద్వారా హద్దులు వేయించి ఉపాధి హామీ పథకం ద్వారా కందకాల పనులు చేపడితే నీరంతా ఎక్కడిక్కడ ఇంకి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలకు సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఉత్సాహంగా పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు

కంభం: మండలంలోని ఎల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎంఈఓ మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్దేశిత ప్రణాళికలు అనుసరించాలన్నారు. పది ఫలితాలు విద్యార్థి భవితను దిశానిర్దేశం చేస్తాయన్నారు. స్నేహం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు స్నేహం సుబ్బారావు విద్యార్థులకు అట్టలు బహూకరించగా గ్రంథాలయ అభివృద్ధికి ఉమాదేవి పదివేల రుపాయలు అందజేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాల పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.